క్లుప్తంగా

ముగిసిన గుడారంకమ్మ తల్లి కొలుపులు



పిట్టలవానిపాలెం: పోతనకట్టవారిపాలెంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రామదేవత గుడారంకమ్మ తల్లి కొలుపులు ఆదివారంతో ముగిశాయి. గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో దేవాలయానికి చేరుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పొంగళ్లు పొంగించి చద్ది నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయం భక్తులతో కిక్కిరిసింది.

జ్యేష్ఠ మాసం.. అమ్మకు ప్రత్యేకం



చందోలు(పిట్టలవానిపాలెం) :చందోలులో వేంచేసిని బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో జ్యేష్ఠ మాసం మూడవ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి, నైవేద్యాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు రైతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు..



కర్లపాలెం(పిట్టలవానిపాలెం): ప్రతిఫలం ఆశించకుండా చేసేదే సేవ అని ప్రముఖ విజయవాడ నిమ్స్ న్యూరాలజిస్టు గోపాల శివన్నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సేవా సమితిలో పేరలి నరసయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా షుగర్, బీపీ వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు చల్లా రామమోహన్‌రావు 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. రోగులకు ఆహారం అందజేశారు. సమితి అధ్యక్షుడు తిమ్మరాజు వెంకట సుబ్బారావు, పెనుమెత్స బాపిరాజు, తూనుగుంట్ల లలితబాబు, జిడుగు వెంకటేశ్వర్లు, బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

శరీరం, మనస్సును సమన్వయం చేసేదే యోగ



కర్లపాలెం(పిట్టలవానిపాలెం): శరీరం, మనస్సు సమన్వయం చేసేదే యోగ అని పతంజలి యోగ శిక్షకుడు బాలాజీ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీరామకృష్ణ సేవా సమితిలో 20 రోజులుగా నిర్వహిస్తున్న యోగ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. సమితి సభ్యుడు బాలాజీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితీ అధ్యక్షుడు తిమ్మరాజు వెంకటసుబ్బారావు, ఎ.వెంకటేశ్వర్లు, జిడుగు వెంకటేశ్వర్లు, బుర్ల బుల్లయ్య, పెనుమెత్స బాపిరాజు ఉన్నారు.

రైస్ కార్డ్ దరఖాస్తుకు అవకాశం

భట్టిప్రోలు: వివిధ కారణాలతో రైస్(బియ్యం) కార్డు తొలగించబడిన వారికి, రైస్ కార్డులో పేర్లు లేని వారిని కార్డులో చేర్చడం, ఒంటరి వ్యక్తులకు కొత్తగా రైస్‌కార్డులకు దరఖాస్తు చేసుకునే అవకాశం సచివాలయాల్లో కల్పించడమైనదని ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదిలో కేవలం ఈ అవకాశం రెండు సార్లు మాత్రమే కల్పించబడుతుందని పేర్కొన్నారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలని తెలిపారు.

విగ్రహం ధ్వంసంపై ఫిర్యాదు

బాపట్లటౌన్: పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న రమాబాయి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారంటూ అంబేడ్కర్ యువజన సంఘం కన్వీనర్ గుదే రాజారావు ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ఎస్‌ఐ రఫీ కేసు నమోదుచేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

భూహక్కు సర్వే పనులు వేగవంతం

- గ్రౌండ్ ట్రూతింగ్ పనుల్లో అధికారులు నిమగ్నం
- శరవేగంగా పనులు పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు

రేపల్లె: నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, సరికొత్త భూ రికార్డుల రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రతి 35 కిలో మీటర్లకు ఒక చోట కార్స్ బేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి, ఆ పరిధిలోని భూముల రికార్డులను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. నిజాంపట్నంలో కార్స్ బేస్ స్టేషన్ ఏర్పాటు చేసి, భూ సర్వే పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు.

పట్టణంలో పనులు వేగవంతం

బ్రిటీష్ కాలం నాటి భూ రికార్డులు ఆధారం కావటం, ఆ రికార్డులు పలు ప్రాంతాల్లో కనిపించకపోవటంతో భూ లావాదేవీల్లో ఎన్నో అవాంతరాలు, అభ్యంతరాలు, అవరోధాలు ఎదురవుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో 100 ఏళ్ల నాటి రికార్డులను ఆధారం చేసుకుని, ప్రస్తుత పరిస్థితులపై పట్టణంలో భూ సర్వే పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు.

తొలుత పట్టణం నడిబొడ్డులోని మున్సిపల్ కార్యాలయ భవనంపై గ్రౌండ్ కంట్రోల్ పాయింట్ (జీసీబీ) ఏర్పాటు చేశారు. జీసీబీ పాయింట్‌ను కేంద్ర బిందువుగా చేసుకుని డ్రోన్ ద్వారా వెక్టరైజేషన్ ప్రకియలను పూర్తి చేశారు. ప్రస్తుతం రోవర్స్ ద్వారా భూ యజమానుల హద్దులు (గ్రౌండ్ ట్రూతింగ్) పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నారు.



మున్సిపల్ కార్యాలయంపై ఏర్పాటు చేసిన జీసీబీ పాయింట్

10.97 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన పట్టణం..

రేపల్లె, ఇసుకపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో ఏర్పడిన రేపల్లె పట్టణం 10.97 చదరపు కిలోమీటర్ల పరిధిలో సువిశాలంగా విస్తరించింది. రేపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలో 2,038.26 ఎకరాలు, ఇసుకపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని 661.99 ఎకరాలు.. మొత్తం 2,700.25 ఎకరాల్లో భూ సర్వే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రేపల్లె పరిధిలో 126.84 ఎకరాలు, ఇసుకపల్లి పరిధిలో 26.52 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ప్రస్తుతం సర్వే పనులు నిర్వహిస్తూ నికర ప్రభుత్వ భూమిని గుర్తించే పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. అదే విధంగా 11,256 ప్రైవేటు ఆస్తులకు సంబంధించిన హద్దులను నిర్ధారించే పక్రియను వేగవంతం చేశారు.

ఆస్తులకు ప్రత్యేక నంబర్ల కేటాయింపు..

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా భూముల సర్వే నిర్వహించి.. పట్టణంలోని 28 వార్డుల్లో ఆయా ఆస్తులకు టౌన్ సర్వే నంబర్, బ్లాక్ నంబర్, వార్డు నంబర్‌ను కేటాయించటం జరుగుతుంది. ఆయా ఆస్తులకు సంబంధించి వివరాలను సులభతరంగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. అదే విధంగా భూ కమత పత్రం, పట్టణ సర్వే పత్రం, రీ సర్వే ల్యాండ్ రిజిస్టర్, 1బీ రిజిస్టర్, శాశ్వత భూ హక్కు పత్రాలను రూపొందించటం జరుగుతుంది.



పట్టణంలో రోవర్ పరికరం ద్వారా ఇంటి స్థలాన్ని కొలతలు వేస్తున్న సర్వే బృందం

ప్రయోజనాలెన్నో..సహకరించాలి



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న భూ సర్వేతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. భూ వివాదాలకు ఎటువంటి అవకాశం ఉండదు. అధునాతన పరికరాల ద్వారా యజమానుల భూములను ఖచ్చితంగా నిర్ధారించటం జరుగుతుంది. సర్వే సమయంలో భూ యజమాలు డాక్యూమెంట్స్‌తో తప్పనిసరిగా హాజరై భూ సర్వేకు సహకరించాలి.

– విజయసారథి, మునిపల్ కమిషనర్, రేపల్లె.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని 24వ వార్డులో నూతనంగా నిర్మించిన మహ్మదీయ మసీదును ఆదివారం ఆయన ప్రారంభించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆధ్యాత్మిక చింతన కలిగిన వారిలో మానసిక ప్రశాంతత కలిగి ఉంటుందన్నారు. ఐక్యమత్యంతో ముస్లిం సోదరులు మసీదును నిర్మించుకోవటం ఆనందంగా ఉందన్నారు. మసీదు అభివృద్ధికి తమ వంతు సహకారాలు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం ముస్లింలకు అండగా నిలుస్తుందన్నారు. అనంతరం ఎంపీ మోపిదేవిని ముస్లిం సోదరులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొమ్మూరి వీరబ్రహ్మేంద్రస్వామి, కౌన్సిలర్ బేతపూడి కోటేశ్వరరావు, రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బేతపూడి వెంకట మహాలక్ష్మి, వార్డు నాయకులు షేక్ ఇర్షద్, కరీముల్లా, సయ్యద్ కరీముల్లా, నాసర్ వలి తదితరులు పాల్గొన్నారు.

పిరాట్లంకలో..

పిరాట్లంక గ్రామంలో ఆదివారం గంగానమ్మ ఉత్సవాలలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి సారె అందజేసి, మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మొగలిపువ్వు బాబూరావు, దూళిపాళ్ల పుల్లారావు, శ్రీను పాల్గొన్నారు.



నమాజు నిర్వహిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

మొగదారమ్మతల్లి ఆలయంలో అన్నదానం

నిజాంపట్నం: మొగదారమ్మతల్లి ఆలయ ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొగదారమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, హరనాథబాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, బోటు ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు కన్నా శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, నాజర్‌ఖాన్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పంటలు దగ్ధం

కొల్లూరు: అగ్ని ప్రమాదం సంభవించి, చేతికందిన పంట బుగ్గిపాలు అయిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక, పంట కోల్పోయిన రైతుల కథనం మేరకు.. సుగ్గునలంకలోని పంటపొలాల్లో గాలుల కారణంగా విద్యుత్తు తీగలు ఒకదానికి ఒకటి రాసుకుని నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. మొక్కజొన్న వ్యర్థాలపై నిప్పురవ్వలు పడటంతో మంటలు వ్యాపించాయి. గాలులు తోడవడంతో పంట పొలాలను మంటలు చుట్టుముట్టాయి. 2 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్న సుగ్గున రమేష్‌కు చెందిన చెరకు పంట, సుగ్గున రాంబాబుకు చెందిన మరో ఎకరంలోని విరగడీసి కల్లంపై ఉన్న మొక్కజొన్న కండెలు మంటల్లో దగ్ధమయ్యాయి. ప్రమాదం కారణంగా ఇరువురు రైతులకు సుమారు రూ.1.30 వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంద పంట దగ్ధం

కొల్లూరు: మొక్కజొన్న వ్యర్థాలు తగలబెట్టడానికి.. పెట్టిన మంటలు వ్యాపించి, కంద పంట దగ్ధమైన ఘటన ఆదివారం గాజుల్లంకలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత రైతు కథనం మేరకు.. మొక్కజొన్న సాగు చేసిన వంట పొలాల్లో వ్యర్థాలను తగలపెట్టేందుకు రైతులు నిప్పు పెట్టారు. గాలుల ప్రభావంతో మంటలు పరిసర ప్రాంతాలకు వ్యాపించి, గాజుల్లంకకు చెందిన చందన శివయ్య ఎకరం విస్తీర్ణంలో సాగు చేపట్టిన కంద పంటకు వ్యాపించాయి. కంద సాగు చేసిన పొలంలో కూడా మొక్కజొన్న వ్యర్థాలు ఉండటంతో మంటలు ఎగపాకి పంట అగ్నికి ఆహుతైంది. సుమారు రూ. 1.50 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.



సుగ్గునలంకలో దగ్ధమైన చెరకు పంట

శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన చీఫ్ విప్

బాపట్ల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి శ్రీ మహాలక్ష్మీ – గరుడ ద్వార పాలకులు మూషిక అయ్యప్ప నాగరాజు గణేషులతో కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం సాయంత్రం వైభవంగా తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ పండితుల పర్యవేక్షణలో ' అంకురారోహణ' కార్యక్రమం జరిగింది. ఆలయ నిర్మాత, వ్యవస్థాపకులు, శాశ్వత ధర్మకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు శాస్త్రోక్తంగా వేద పండితుల వచనాల మధ్య అంకురారోహణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామి వార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ పండితులు రంగాచార్యులు, పలువురు టీటీడీ పరిపూర్ణ పండితుల సారథ్యంలో త్రయాహ్నికంగా ఈ నెల 7న విగ్రహ ప్రతిష్ఠ జరుగనున్నట్లు ఆయన తెలిపారు.



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ..



కొల్లూరు: కొల్లూరులో జరుగుతున్న వైఎస్సార్ స్మారక హార్డ్ టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నీ రౌండ్‌లో పలు జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. ఆదివారం మోపర్రు జట్టు జంపని టీంపై విజయం సాధించగా, ఈపూరు చిత్ర భూమి జట్టుపై పోరాడిన చిలుమూరు జట్టు గెలుపును సొంతం చేసుకుంది. ఆవులవారిపాలెం, క్రాప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆవులవారిపాలెం జట్టు గెలుపొందగా, చుండూరు జట్టుపై తురుమెళ్ల జట్టు విజయం సాధించింది. బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్‌నాగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌ను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి క్రికెట్ అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, ఓడిన జట్లకు క్రికెట్ బ్యాట్‌లను అందజేశారు.

225 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

రేపల్లె: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాలులో శంకర్ కంటి హాస్పటల్ వైద్యులు ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డీఎస్పీ మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్లకు ఎటువంటి సమస్యలు ఎదురైనా వైద్యులను సంప్రదించి చికత్స పొందాలన్నారు. శిబిరంలో 225 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, 135 మందికి శుక్లం ఆపరేషన్‌లకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. క్లబ్ సభ్యులు జి.బాపారావు, కె.నాగమల్లేశ్వరరావు, సాయేశ్వరరావు, రామారావు, రామచంద్రరావు, శ్రీనివాసరావు, బుచ్చిరావు, పీఎస్ఎస్ ప్రసాద్, కే.భవానీ తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

క్రీస్తు లూథరన్ చర్చికి రూ.లక్ష వితరణ



రేపల్లె రూరల్: మండలంలోని పెనుమూడి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న క్రీస్తు లూథరన్ చర్చి ప్రతిష్ఠా మహోత్సవానికి ఆదివారం ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ఆయన సోదరుడు శివప్రసాద్ రూ.1,00,116ల వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, నాయకులు గుత్తికొండ రఘు, ఉప్పాల శ్రీను, ధనుంజయ, మాజీ సర్పంచ్ పెనుమూడి నాగేశ్వరరావు, సంఘ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌లకు 180 మంది ఎంపిక

చెరుకుపల్లి: కంటి జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఎస్ఐ వెంకట కొండారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, మల్లెల సాంబశివరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, గుంటూరు శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఎస్ఐ కొండారెడ్డి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని ఎస్ఐ అన్నారు. శిబిరానికి 250మంది హాజరు కాగా, వారిలో 180మంది కంటి శుక్లాల ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరికి పెదకాకాని శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు మల్లెల సురేష్ తెలిపారు. వైద్యులు బల్‌జీర్ సింగ్, మౌనిక, స్థానిక పెద్దలు, ఉపాధ్యాయుడు మొగలిపువ్వు శ్రీనివాసరావు, కృష్ణ ప్రసాద్, ఉచా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ బల్‌జీర్ సింగ్

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

అబ్బునగూడవల్లి(వేమూరు): అబ్బునగూడవల్లిలో అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వంట సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. గత నెల 31న అబ్బునగూడవల్లి గ్రామంలో అగ్ని ప్రమాదం వల్ల బొందల పాటి వెంకటనారాయణ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. బాపట్లరెడ్ క్రాస్ సోసైటీ అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం అందజేస్తామని చైర్మన్ డాక్టరు వి.వీర రాఘవయ్య తెలిపారు. ఎంపీపీ యల్లమాటి మోహనరావు, ఏఎంసీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ కొండిశెట్టి రాంబాబు, ఎంపీటీసీ కొందూరు లక్ష్మీ నాగ రాజకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.



బాధితులకు వంట సామగ్రి అందజేస్తున్న రెడ్ క్రాస్ సోసైటీ సభ్యులు

చేనేత వస్త్రాలపై జీఎస్టీ తొలగించాలి

భట్టిప్రోలు: ప్రస్తుతం చేనేత సంక్షోభానికి ప్రధాన కారణమైన రంగులు, నూలు, రసాయనాలు, చేనేత వస్త్రాలపై జీఎస్టీని వెంటనే ఎత్తి వేయాలని ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కమిటీ నాయకులు మురుగుడు సత్యన్నారాయణ ఆదివారం డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో సత్యన్నారాయణ మాట్లాడారు. అప్పుల బాధ తాళలేక సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మిక కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షలు ఆర్థిక సాయం అందించాలని కోరారు. చేనేత సంక్షోభాన్ని నివారించేందుకు సొసైటీల్లో, మాస్టర్ వీవర్ల వద్ద పేరుకు పోయిన వస్త్ర నిల్వలను ప్రభుత్వాలు కొనుగోలు చేయాలని కోరారు. అలాగే ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి 20 శాతం సబ్సిడీతో రూ. 2 లక్షల ముద్ర రుణాన్ని ఇప్పించి ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మెయిన్ సొసైటీ మాజీ అధ్యక్షుడు బి.నాగమల్లేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం నాయకులు ఎ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మురుగుడు సత్యన్నారాయణ

వృద్ధుడికి వడదెబ్బ..కాపాడిన స్థానికులు

కొల్లూరు : ప్రాణాపాయ స్థితిలో ఉన్న వృద్ధుడిని రక్షించి సాటి ప్రజలు మానవత్వాన్ని చాటుకున్నారు. బొద్దులూరుపాడుకు చెందిన 60 ఏళ్ల వృద్ధుడు బెల్లంకొండ రామయ్య ఆదివారం ధాన్యం మాసులు పనికి వెళ్లాడు. సాయంత్రం పని ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్లాడు. రాత్రైనా..రామయ్య ఇంటికి చేరుకోకపోవడంతో అతని భార్య ఆయనతో వెళ్లిన కూలీలను ఆరా తీసింది. స్థానిక వీఆర్‌ఓ శరత్, స్థానికుడు పంతగాని రామ్ ప్రసాద్‌తో కలిసి పంట పొలాల మధ్యలో వడదెబ్బకు గురయ్యి.. సొమ్మసిల్లి పడిపోయిన రామయ్యను గుర్తించారు. మంచం సాయంతో గ్రామంలోకి తీసుకెళ్లి.. స్థానిక ఆర్ఎంపీ వద్ద ప్రథమ చికిత్స అందించారు. అనంతరం రామయ్య పరిస్థితి మెరుగుపడిందని బంధువులు తెలిపారు.



వడదెబ్బకు గురైన వృద్ధుడిని పరిశీలిస్తున్న స్థానికులు

ద్విచక్ర వాహనాలు ఢీ.. వ్యక్తి మృతి

మోపర్రు(వేమూరు): అతి వేగంగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని, వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చుండూరు మండలానికి చెందిన రాజేష్, మోపర్రు గ్రామానికి చెందిన వరప్రసాద్ బైక్‌లు అమర్తలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో ఢీ కొనడంతో రాజేష్(40) అక్కడిక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన వర ప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తెనాలి ప్రభుత్వం వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మృతుదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం.. తెనాలి ప్రభుత్వం వైద్య శాలకు తరలించడం జరిగిందని ఆయన తెలిపారు.

జ్ఞాపకాలను పంచుకుంటూ..



పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బాపట్ల: బాపట్ల పట్టణంలోని విలియంబూత్ కళాశాలలో 2003–05లో ఇంటర్మీడియట్ సైన్సు గ్రూపు చదివిన విద్యార్థులు 18 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనమయ్యారు. తమ మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ.. ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. గురువుల గొప్పతనాన్ని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ మేజర్ రత్న భూషణం, గోపాలకృష్ణమూర్తి, అప్పటి అధ్యాపకులు జయకర్, శ్యామ్ లివింగ్‌స్టన్, పౌలస్, విజ్ఞాన కుమార్, హేబేలు, ఆచార్య, నవీన్, జర్మియా పాల్గొన్నారు.

వైభవంగా లక్ష మల్లెపూల పూజ

రేపల్లె: జేష్ఠపౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం గ్రామదేవత బూరుగులమ్మ ఆలయంలో అర్చకుడు నందివెలుగు భాను సుధాకర్ గురుకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నాభిషేకం చేశారు. సాయంత్రం మహిళలు లక్ష మల్లెపూల పూజలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలతో కూడిన సారెను బహూకరించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



అమ్మవారికి లక్ష మల్లెపూల పూజ చేస్తున్న అర్చకులు

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

భట్టిప్రోలు: దశాబ్దాల చరిత్ర కలిగిన భట్టిప్రోలు ఎంఆర్ఆర్ అండ్ ఏవీఎస్ జూనియర్ కళాశాల నూతన విద్యా సంవత్సర ఆరంభ వేడుకలలో భాగంగా ఆదివారం నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎం. తాండవ కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభ్యున్నతి కోసం ఈ కళాశాల స్థాపించబడిందని తెలిపారు. ఎంతో మంది విద్యార్థులు ఈ కళాశాలలో విద్యాభ్యాసం చేసి ఉన్నత పదవులు అధిరోహించారని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ భూపతి రమేష్‌బాబు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందించే కంప్యూటర్ విద్యను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందించాలనే సదుద్దేశంతో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత విద్యా సంవత్సరం అత్యున్నత ఫలితాలను సాధించడానికి కృషి చేసిన అధ్యాపకులను ఆయన అభినందించారు.

ముతవల్లి వారసులను ఆదుకోవాలి

– ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నాగుల్ మీరా

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో ఉన్న పీర్ల చావిడిలకు సంబంధించిన ముతవల్లి వారసులు ఉన్నప్పటికీ వక్ఫ్ చట్టానికి, రూల్స్‌కు విరుద్ధంగా డైరెక్ట్ మేనేజ్ మెంట్‌లో లేని వక్ఫ్ సంస్థలకు సంబంధించిన భూములను లీజుకు ఇవ్వాలని బోర్డు ఇన్‌స్పెక్టర్ ముక్తార్ బాషా పత్రికల్లో నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంబంధిత పీర్ల చావడి వారసులు ప్రతి సంవత్సరం వక్ఫ్ ఫండ్ కడుతున్నారని తెలిపారు. అలాగే పీర్ల చావిడిలను సక్రమంగా నిర్వహించడమే కాక ఏటా ఘనంగా మొహర్రం పండుగ నిర్వహిస్తూన్నా, కొందరు వక్ఫ్ భూములను కాజేయాలని అధికారులతో కుమ్మక్కై లీజు కొరకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. తరతరాలుగా పీర్ల చావిడిలను నమ్ముకుని ఆ భూములలో వ్యవసాయం చేసుకుంటూ వచ్చే రాబడితో చావిడిలు నిర్వహిస్తున్న ముతవల్లి వారసులను ఆదుకోవాలని ఆయన కోరారు మహ్మద్ సలీమ్, కరిముల్లా బేగ్, ఇస్మాయిల్ బేగ్, హసన్ బేగ్, షేక్ మూసా తదితరులు పాల్గొన్నారు.